క్లుప్తంగా

'ఫ్యామిలీ డాక్టర్'ను సద్వినియోగం చేసుకోండి



వైద్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న డాక్టర్ మంజువాణి

మడకశిరరూరల్: 'ఫ్యామిలీ డాక్టర్' సేవలను సద్వినియోగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ మంజువాణి తెలిపారు. సోమవారం బుళ్లసముద్రం గ్రామంలో క్యాంపు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న వైద్య సేవలను ఆమె పర్యవేక్షించారు. చిన్నారులు, బాలింతలకు టీకాలు వేశారు. ఆమె మాట్లాడుతూ కల్లుమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఈనెల 12 వరకూ ఇంద్ర ధనుష్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ మాధుర్య, సిబ్బంది పాల్గొన్నారు.

శరవేగంగా రోడ్డు నిర్మాణ పనులు



నూతనంగా నిర్మిస్తున్న రహదారి

పెనుకొండ రూరల్: పెనుకొండ నుంచి అనంతపురం వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. సోలార్ పరిశ్రమ నుంచి తిమ్మాపురం రైల్వే వంతెన వరకు 2 కిలో మీటర్ల రూ.4.60 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నట్లు రహదారుల భవనాలశాఖ జేఈ వెంకటేష్ తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

లేపాక్షి: మండల కేంద్రమైంలోని పెట్రోల్ బంకు ముందు ద్విచక్రవాహనంలో వెళ్తున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో గాయపడ్డాడు. వివరాలు ఇలా వున్నాయి. హిందూపురం పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి (60) లేపాక్షి నుంచి హిందూపురం వైపు ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. వెనుక వైపు నుంచి వస్తున్న కారు అదుపుకాక ద్విచక్ర వాహనాన్నిను ఢీకొంది. ద్విచక్రవాహనం నడుపుతున్న వ్యక్తికి కుడిచేయ్యి విరగడంతో పాటు గాయాలయ్యాయి. వెంటనే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం హిందూపురం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరు ఆస్పత్రికి సిఫార్సు చేశారు.

పాఠశాలల తనిఖీ

రొళ్ల: మండలంలోని దొడ్డేరి ప్రాథమిక పాఠశాల, రత్నగిరి ఆదర్శ పాఠశాలను సోమవారం ఎంఈఓ–2 శ్రీధర్ తనిఖీ చేశారు. రికార్డులు తనిఖీ చేసి విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పుండా పాఠశాలకు హాజరయ్యే విధంగా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలన్నారు. మెనూ ప్రకారం భోజనాన్ని వడ్డించాలని ఏజెన్సీలకు సూచించారు. తర్వాత విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదవాలి



విద్యార్థుల వర్కు పుస్తకాలను పరిశీలిస్తున్న డీవైఈఓ రంగస్వామి

గుడిబండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని డివిజన్ విద్యాధికారి రంగస్వామి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. విద్యా ప్రగతి, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఆరా తీశారు. విద్యార్థుల వర్కు పుస్తకాలను పరిశీలించి వారిని ప్రశ్నలు వేసి సమాధానం తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం మెనూ సక్రమంగా అమలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ రవిచంద్రకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డెంగీ,మలేరియాపై అవగాహన



దోమల మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్: డెంగీ,మలేరియా వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా నివారణ అధికారి కుళ్లాయప్ప నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని రాంపురంలో వ్యాధులపై వైద్యసిబ్బంది అవగాహన కల్పించారు. ప్రతి ఇంటా వారానికోసారి నీటి తొట్టెలు, డ్రమ్ములను శుభ్రం చేయించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మోసం మరువం బాబూ!

- టీడీపీ హయాంలో సాగునీటి ప్రాజెక్టులను పట్టించుకోకుండా వంచన
- మడకశిరవాసులకు అన్యాయం చేస్తూ కుప్పానికి సాగు నీరు తరలింపు
- వైఎస్ జగన్ హయాంలో ఏటా మడకశిరకు కృష్ణాజలాలు
- టీడీపీ నాయకుల అబద్ధపు ప్రచారంపై ప్రజల విస్మయం



హంద్రీనీవా కాలువలో నీరు ప్రవహిస్తున్న దృశ్యం

మడకశిర: టీడీపీ హయాంలో సాగునీటి పథకాల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రధానంగా హంద్రీనీవా కాలువ పనులకు పైసా నిధులు కూడా ఖర్చు పెట్టలేదు. మడకశిర నియోజకవర్గానికి హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణాజలాలు అందించాలనే లక్ష్యంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే హంద్రీనీవా కాలువను ఏర్పాటు చేశారు. ఆయన మరణించిన తర్వాత అధికారంలో ఉన్న ప్రభుత్వాలు కాలువ పనులను పూర్తి చేయడానికి చొరవ తీసుకోలేదు. 2014లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత హంద్రీనీవా పనులను అసలు పట్టించుకోలేదు.

కుప్పంకు జలాలు తరలించి అన్యాయం..

చంద్రబాబు హయాంలో మడకశిరకు కృష్ణాజలాలు అందించకుండా రైతులకు తీవ్ర అన్యాయం చేశారు. కుప్పంకు తరలించారు. కేవలం రెండు చెరువులకు మాత్రమే నీరు అందించి చేతులు దులుపుకున్నారు. అయితే, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత మడకశిరకు ప్రతి ఏటా కృష్ణాజలాలు అందుతున్నాయి. మడకశిర చెరువును మూడు సార్లు నింపిన ఘనత వైఎస్ జగన్‌దే. అంతే కాకుండా మణూరు, ఉప్పిడిపల్లి, కల్లుమర్రి, భక్తరహళ్లి, హరేసముద్రం, ఛత్రం, గౌడనహళ్లి చెరువులను కృష్ణాజలాలతో నింపి రైతులను ఆదుకున్నారు. దీంతో మడకశిర ప్రాంతంలో పరోక్షంగా తాగునీటి సమస్య కూడా పరిష్కారమైంది. టీడీపీ హయాంలో పట్టించుకోని రత్నగిరి, మదిగుబ్బ రిజర్వాయర్ల నిర్మాణానికి కూడా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

బైపాస్ కెనాల్‌కు రూ.214.85 కోట్లు మంజూరు

నియోజకవర్గంలోని అన్ని చెరువులను కృష్ణాజలాలతో నింపడానికి సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. మడకశిర బైపాస్ కెనాల్‌కు రూ.214.85 కోట్లు మంజూరు చేశారు. టెండర్లు కూడా పూర్తి చేశారు. పనులను చేపట్టడానికి అవసరమైన అన్ని ప్రక్రియలు కూడా పూర్తి అయ్యాయి. త్వరలోనే పనులు కూడా ప్రారంభం కానున్నాయి. అంతే కాకుండా అమరాపురం మండలానికి కృష్ణాజలాలను తీసుకెళ్లేందుకు కాలువను కూడా సిద్ధం చేశారు. రూ.2.31 కోట్లు ఖర్చు చేశారు.

ఏమీ చేయలేదంటూ ప్రచారం..

అయితే, నియోజకవర్గంలో సోమవారం టీడీపీ నేతలు ప్రాజెక్టుల పరిశీలన పేరుతో హడావుడి చేశారు. మడకశిరకు సాగు నీరు అందించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఏమీ చేయలేదంటూ అబద్ధపు ప్రచారం చేశారు. చంద్రబాబు నాయుడు హయాంలోనే సాగు నీటి విషయంలో మడకశిరకు తీవ్ర అన్యాయం జరిగిన విషయాన్ని టీడీపీ నాయకులు గుర్తించకుండా వైఎస్ జగన్‌పై తప్పుడు ప్రచారం చేయడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. చంద్రబాబు హయాంలోనే తమకు సాగు నీరు అందలేదనిప వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ప్రతి ఏడాది సాగు నీరు అందుతున్నాయని రైతులు తెలిపారు.

టీడీపీ నాయకులకు సిగ్గులేదు



టీడీపీ నాయకులు సిగ్గులేకుండా మడకశిర నియోజకవర్గంలో పర్యటించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సాగు నీరు అందించడానికి తీసుకున్న చర్యలు శూన్యం. కుప్పంకు కృష్ణాజలాలు తరలించి మడకశిర రైతులకు అన్యాయం చేసిన వ్యక్తి చంద్రబాబు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ప్రతి ఏడాది సాగు నీరు వస్తున్నాయి.

- ఎమ్మెల్యే తిప్పేస్వామి

అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ కార్తీక్

గుడిబండ: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమం జరిగింది. పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలపై 74 అర్జీలు వచ్చాయని ఆయన తెలిపారు. పలు సమస్యలకు అక్కడిక్కడే పరిష్కార మార్గం చూపారు. మిగిలిన సమస్యలను వారంలోపు పరిష్కరిస్తామని తెలిపారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నామని తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడిందన్నారు. కార్యక్రమంలో డీవైఈఓ రంగస్వామి, తహసీల్దార్ నాగభూషణం, ఎంపీడీఓ రామారావు, ఎంపీపీ రాధమ్మ, జెడ్పీటీసీ భూతరాజు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రొద్దం: మండలంలోని పెద్దమంతూరు జెడ్పీహెచ్ఎస్ పోలింగ్ కేంద్రాన్ని సబ్‌కలెక్టర్ కార్తీక్ సోమవారం పరిశీలించారు. కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలూ ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ అనంతచారి, ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్‌ను ఆదేశించారు. ఆర్ఐ, వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత జెండా ఆవిష్కరణ

సోమందేపల్లి: మండల కేంద్రంలో ప్రపంచ చేనేత దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కొత్తపల్లి రోడ్డులో చేనేత ఐక్యవేదిక నాయకులు చేనేత జెండాను ఆవిష్కరించారు. కార్మికుల సంక్షేమానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో చేనేత ఐక్యవేదిక నాయకులు శిలా నారాయణ స్వామి, కిష్టప్ప, జనార్దన్ సుధాకర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కుటుంబాలకు దుస్తుల పంపిణీ

హిందూపురం టౌన్: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని తొగట వీరక్షత్రియ సేవా సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు శ్రీలత ఆధ్వర్యంలో చేనేత కుటుంబాలకు దుస్తులు, చీరలను పంపిణీ చేశారు. సోమవారం స్థానిక వీవర్‌కాలనీ, ముద్దిరెడ్డిపల్లిలో నివాసముంటున్న 60 చేనేత కుటుంబాలకు షర్టు, ప్యాంటు, చీరలను అందజేశారు. కార్యక్రమంలో రంగయ్య, మల్లికార్జున, నాగేంద్ర, శ్రీనివాసులు, మంజునాథ్, భార్గవ్, రవీంద్ర, గోపాల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వీవర్స్‌కాలనీలో తెలుగు చేనేత పారిశ్రామిక శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ చేపట్టారు. అలాగే బీజేపీ ఆధ్వర్యంలో వీవర్స్‌కాలనీలో ర్యాలీ నిర్వహించారు.



హిందూపురంలో చేనేత కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని చేనేత కాలనీలోకి విద్యార్థులను తీసికెళ్లి చేనేత రంగం విశిష్టత, వివిధ రకాల చేనేత శిక్షణ కార్యక్రమాలను అవగాహన కల్పించామని ప్రధానోపాధ్యాయురాలు సుధామణి తెలిపారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

సోమందేపల్లి: మండల కేంద్రంలోని స్నేహలత నగర్, ద్వారకామయి నగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ మండల కన్వీనర్ వెంకటరత్నం తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచాలి

రొళ్ల: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నిఘా ఉంచాలని మడకశిర సీఐ సురేష్ బాబు సూచించారు. సోమవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ రొళ్ల మండలం కర్ణాటక సరిహద్దుగా ఉన్న నేపథ్యంలో అక్రమంగా మద్యంతో పాటు ఇతర త్ర నిషేధిత వస్తువులు తరలించే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. సరిహద్దులో నిఘా పెట్టాలని ఆదేశించారు. మట్కా, జూదం, అక్రమ మద్యం సరఫరా అరికట్టాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలపై శ్రద్ధ ఉంచాలి

మడకశిర: గర్భిణులు, బాలింతలు, పుట్టిన బిడ్డపై కుటుంబసభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీఎస్ఆర్ఎం డాక్టర్ దివాకర్ కోరారు. సోమవారం కేర్ క్యాంపెయిన్‌పై స్థానిక ఆస్పత్రిలో డాక్టర్లు, నర్సులు తదితర సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తల్లులు కూడా జాగ్రత్తలు తీసుకున్నప్పుడే ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలిపారు. సిబ్బంది కూడా బాధ్యత వ్యవహరించాలన్నారు. న్యూరాహెల్త్ శిక్షకులు శివయ్య మాట్లాడుతూ ఈ అంశంపై తిరుపతిలో నర్సులకు శిక్షణ తరగతులు కూడా నిర్వహించినట్లు తెలిపారు. మడకశిర ఆస్పత్రి నుంచి ముగ్గురు సిబ్బంది శిక్షణ పొందారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వరలక్ష్మి, హెడ్ సిస్టర్లు పూర్ణిమ, మంజుళ, కౌన్సిలర్ కృష్ణమూర్తి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాలోడులో ఆరోగ్య శిబిరం

పావగడ: తాలూకాలోని వైఎన్ హొసకోట హోబళి దొడ్డ జాలోడు గ్రామంలో ఆరోగ్య, సాంఘిక సంక్షేమ శాఖ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. గ్రామ ప్రజలకు మధుమేహం, రక్తపోటు పరీక్షలు నిర్వహించారు. వాటి నివారణకు ఔషధాలు అందించారు. గ్రామీణ ప్రజలు

సంక్షిప్త సమాచారం

ఆరోగ్యాలపై శ్రద్ధ చూపకుండా నిర్లక్ష్యం చేస్తుండడంతో ప్రాణాంతక బీపీ, షుగర్, మహమ్మారులతో ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎప్పటి కప్పుడు పీహెచ్‌సీలలో రక్త పరీక్షలు చేయించుకుని తగిన ఔషధాలు తీసుకుని ఆరోగ్యాలను కాపాడుకోవాలని గ్రామ పంచాయతీ పీడీఓ జయణ్ణ సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అపర్ణ, అంగనవాడి కార్యకర్తలు శివ గంగమ్మ, వృతి, ప్రేమ, ప్రతిభ, రాధమ్మ, లక్ష్మి, ఆశా కార్యకర్తలు గంగమ్మ, భారతి, వరలక్ష్మి, లక్ష్మిదేవి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి కవి మిత్ర అవార్డు



ముద్దరంగప్పకు అవార్డు అందజేస్తున్న దృశ్యం

అమరాపురం: కే శివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు ముద్దరంగప్ప కవి మిత్ర అవార్డు అందుకున్నట్లు సోమవారం ఉపాధ్యాయులు తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రంలో రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన పర్యావరణ పరిరక్షణ సభలో ముద్దరంగప్ప చెప్పిన కవితను మెచ్చి అవార్డు అందజేశారన్నారు.

అగళి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులతో సోమవారం ఎంఈఓ–1 భాస్కర్ సమావేశం నిర్వహించారు. నాడు నేడు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, జేవీకే, ఉపాధ్యాయుల జీతాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు సన్మానం

హిందూపురం టౌన్: ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో బదిలీ, పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను సోమవారం స్థానిక ఎంజీఎం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. అలాగే ఇతర సంఘాల నుంచి ఏపీటీఎఫ్ సంఘంలో చేసిన నాయకులను సత్కరించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్, రాష్ట్ర కన్వీనర్ ముత్యాలప్ప, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి త్రిమూర్తులు, జిల్లా కార్యదర్శి అంజనమూర్తి తదితరులు పాల్గొన్నారు.

డ్రైయినేజీ నిర్మించాలని వినతి

పెనుకొండ: సోమందేపల్లిలో ఎన్‌టీఆర్ సర్కిల్ నుంచి కొత్తపల్లి రోడ్డు వరకు డ్రైయినేజీ నిర్మించాలని సీపీఐ నాయకులు బాలస్వామి, కిష్టప్ప సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందనలో సోమవారం ఏఓ రమణకు వినతిపత్రం అందించారు.

వార్డు సభ్యుడి ఎన్నికకు నోటిఫికేషన్

అమరాపురం: మండలంలోని నిడ్రఘట్ట పంచాయతీలోని 4వ వార్డు సభ్యుని ఎన్నికకు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశామని ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు. మంగళవారం నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. 14న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని, అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామన్నారు. 19న పోలింగ్, అదే రోజు మధ్యాహ్నం ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు.

తాగు నీటి సమస్య పరిష్కారం

అమరాపురం: మండలంలోని కొరేవు గొల్లహట్టి గ్రామంలో నెలకున్న తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు ఎంపీపీ ఈరన్న, సర్పంచ్ తిప్పేస్వామి సోమవారం తెలిపారు. మండల పరిషత్ నిధుల నుంచి కొత్త మోటారును బోరులోకి వదిలి నీటి సమస్య తీర్చామన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

పెనుకొండ రూరల్: మండలంలోని మరువపల్లిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సోమవారం సీజ్ చేశారు. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ దాదాపీర్ తెలిపారు.

ఉపాధి హామీ పనులపై ప్రజా వేదిక

గోరంట్ల: ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఎంపీపీ ప్రమీల ఆధ్వర్యంలో ఉపాధిహామీ పనులపై ప్రజావేదిక సోమవారం నిర్వహించారు. రూ.7,47,85,530 పనులకు గాను రూ. రూ.23,525 అవినీతి జరిగినట్లు డ్వామా విజిలెన్స్ అధికారుల బృందం తేల్చింది. కార్యక్రమంలో జిల్లా డ్వామా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, అదనపు పీడీ సోమశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పాలే జయరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్ల పాలనలో ఇంటింటికీ లబ్ధి

- ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ

రొద్దం: వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత నాలుగేళ్ల పాలనలో ప్రతి ఒక్కరూ లబ్ధి పొందారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే శంకరనారాయణ పేర్కొన్నారు. సోమవారం రొద్దం గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దగువ్వలపల్లి, చిన్నగువ్వలపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్సీ సానిపల్లి మంగమ్మతో కలసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, సచివాయల సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే శంకరనారాయణ 300 గడపలకు తిరిగారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు ఇంటింటా వివరిస్తూ, సంక్షేమ బ్రోచర్లు అందించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. అర్హత ఉంటే చాలు పార్టీలకతీతంగా సంక్షేమ పథకాల లబ్ధి చేకూరిందన్నారు. ప్రజలకు మేలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి ఇంటిలో రూ.లక్షకు పైబడి సంక్షేమ లబ్ధి చేకూరిందన్నారు.

వృద్ధురాలికి ఆర్థికసాయం : గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికురాలు లక్ష్మీనరసమ్మ అనే వృద్ధురాలికి ఎమ్మెల్యే ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, స్థానిక సర్పంచ్ రూప, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు మారుతీరెడ్డి, వైస్ ఎంపీపీ హరితారెడ్డి, కలిపి సింగిల్ విండో చైర్మన్ కేపీ శ్రీనివాసులు, మాజీ సింగిల్ విండో చైర్మన్ రాజారెడ్డి, ముఖ్య నాయకులు రాజగోపాల్‌రెడ్డి, కలిపి శ్రీనివాసులు, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చేయాల్సిందే

పావగడ: నిందితులను అరెస్టు చేసే వరకూ మృతదేహానికి అంతిమ సంస్కారాలు చేపట్టేది లేదని కుటుంబీకులు భీష్మించారు. పట్టణంలోని బోవి కాలనీ (వడ్డెర)కి చెందిన కొరచ శ్రీనివాస్ (35) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందిన విషయం తెలిసిందే. శ్రీనివాస్ మృతికి కారణమైన నిందితులను అరెస్టే చేయాలని శ్రీనివాస్ మృతదేహంతో పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. సోమవారం కూడా మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించలేదు. నిందితులను పోలీసులు అరెస్టు చేసే వరకూ ఇంటి వద్ద నుంచి శ్రీనివాస్ మృతదేహాన్ని తీసుకెళ్లేది లేదని తెలిపారు. నలుగురు వ్యక్తులు బైకులో వెంటాడి శ్రీనివాస్‌పై పెట్రోల్ చల్లి నిప్పంటించి చంపేశారని ఆరోపించారు. దీంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది.



కాఫిన్ బాక్స్‌లో శ్రీనివాస్ మృతదేహం

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ



మాత్రలు అందజేస్తున్న ఎంఈఓ–2 శ్రీధర్

రొళ్ల: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆవరణలో సోమవారం ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు నులిపురుగు నివారణ మాత్రలను ఎంఈఓ–2 శ్రీధర్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఏడాదిలో రెండు పార్లు నులిపురుగు నివారణ మాత్రలు తీసుకోడవం వల్ల కడుపులో ఉన్న నులిపురుగులు బయటికి వచ్చి ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, హెచ్‌ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎన్నికల ప్రక్రియ

హిందూపురం అర్బన్: చలివెందుల గ్రామ సర్పంచ్ పదవికి మంగళవారం నుంచి ఎన్నికల ప్రక్రియ మొదలు కానున్నట్లు ఎంపీడీఓ నరేంద్రకుమార్ సోమవారం తెలిపారు. ఇప్పటికే ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైందన్నారు. రెండేళ్ల క్రితం సర్పంచ్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు సౌభాగ్యమ్మ విజయం సాధించింది. కొంతకాలం క్రితం ఆమె అనారోగ్యంతో మృతి చెందడంతో ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఈ నెల 19న చలివెందుల పంచాయతీ ఉప ఎన్నిక జరగనుంది. ఓసీ జనరల్ క్యాటగిరీకి కేటాయించారు. కాగా వైఎస్సార్‌సీపీ నాయకులు నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపికను కలసి పార్టీ మద్దతుదారును గెలిపించేందుకు చర్చలు సాగిస్తున్నారు.

8 నుంచి నామినేషన్ల స్వీకరణ

గోరంట్ల: పంచాయతీ వార్డు ఎన్నికలకు అభ్యర్థుల నుంచి నామినేషన్లను ఈనెల 8 నుంచి స్వీకరించనున్నట్లు ఎంపీడీఓ రఘునాథ గుప్త తెలిపారు. గోరంట్ల మేజర్ పంచాయతీ పరిధిలోని 18 వార్డు సభ్యులు రాజీనామా చేయడంతో ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఈ నెల 8 నుంచి 10వతేదీ వరకు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయొచ్చన్నారు. 12న అభ్యంతరాల స్వీకరణ, 13న అభ్యర్థుల జాబితా ప్రచురణ ఉంటుందన్నారు. 14న నామినేషన్లకు తుది గడువు, 19న ఎన్నికలు, అదే రోజున ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. ఎన్నికల అధికారిగా ఈఓఆర్‌డీ సుధాకర్‌ను ప్రభుత్వం నియమించినట్లు ఎంపీడీఓ తెలిపారు.

లేపాక్షి: లేపాక్షి మండలంలోని పులమతి పంచాయతీలో 10వ వార్డు, కోడిపల్లి పంచాయతీలో 2వ వార్డు సభ్యుల ఉప ఎన్నికకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని ఈఓఆర్డీ శివన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పులమతిలో 10వ వార్డు జనరల్‌కు, కోడిపల్లిలో 2వ వార్డు బీసీ మహిళకు రిజర్వు చేయడం జరిగిందన్నారు. ఈనెల 8వ తేది నుంచి 10వ తేది వరకు మండల పరిషత్ కార్యాలయంలో నామినేషన్ల దాఖలు చేసుకోవచ్చన్నారు. 11వ తేదీ స్క్రూటినీ, 12, 13 తేదీల్లో అప్పీల్, 14వ తేదీ ఫైనల్ జాబితా, 19వ తేదిన పోలింగ్ ఉంటుందన్నారు.

జోహార్.. గద్దర్ అన్నా

హిందూపురం: విప్లవవీరుడుగద్దర్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో జోహార్ గద్దర్‌అన్న అంటూ నినదించారు. నాయకులు మాట్లాడుతూ గద్దర్ బడుగు బలహీన వర్గాల్లో ధైర్యం, ఉత్తేజం నింపిన నాయకుడని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి కలగలని కోరుకున్నారు. కార్యక్రమంలో చైతన్య గంగిరెడ్డి, లైఫ్ వరల్డ్ చారిటబుల్ ట్రస్టు కన్వీనర్ ఉదయ్‌కుమార్, జెవీవీ నాయకులు ఈటీ రాంమూర్తి, ఓపీడీఆర్ శ్రీనివాసులు, రైతు సంఘ నాయకులు వెంకటరామిరెడ్డి, సిద్దారెడ్డి, కాంగ్రెస్ నాయకులు బాలాజీ మనోహర్, జమీల్, బీఎస్పీనాయకులు శ్రీనివాసులు, ఆదినారాయణ, సీపీఐ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: గద్దర్ మృతి సాంస్కృతిక, జానపద రంగానికి తీరనిలోటు అని దళిత సంఘం నాయకులు అన్నారు. సోమవారం గద్దర్ చిత్రపటానికి అంబేడ్కర్ సర్కిల్లో అడ్వొకేట్ రామకృష్ణ ఆధ్వర్యంలో పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో వెంకటేసులు, రవూఫ్, ఎమ్మార్పీఎస్ రామాంజనేయులు, నరసింహులు, సూరి, రవి, ఈశ్వర్, మునిమడుగు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పావగడ: స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం ప్రజా గాయకుడు గద్దర్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గద్దర్ మృతితో పావగడ విషాదంలో మునిగి పోయిందన్నారు. పావగడ లో విప్లవ బీజాలు నాటిందే గద్దర్ అన్నారు. 2005లో వెంకటమ్మనహళ్లి ప్రభుత్వ పాఠశాలలో బస చేసిన 9 మంది జవాన్లను కొంత మంది మావోయిస్టులు మట్టుబెట్టి తుపాకులను అపహరించారన్నారు. ఈ కేసులో 8వ ముద్దాయిగా గద్దర్ పేరును స్థానిక పోలీసులు చార్జ్ షీట్‌లో నమోదు చేశారని, కేసుకు సంబంధించి 2019లో గద్దర్ స్థానిక మున్సిఫ్ కోర్టుకు హాజరయ్యారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఈరదాసప్ప, చంద్రణ్ణ, అంజయ్య, గంగాధర్, గౌరమ్మ తదితర నాయకులు పాల్గొన్నారు.



ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గద్దర్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

నేడు జలధి కార్యక్రమం

రొద్దం: మండల కేంద్రంలో మొహర్రం వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో కొలువుదీరిన కుళ్లాయిస్వామి పీర్లను మంగళవారం జలధికి తరలించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఉదయం ప్రత్యేక ప్రార్థనలు, సాయంత్రం జలధి వేడుక ఉంటుందన్నారు.



రొద్దంలో కొలువుదీరిన కుళ్లాయిస్వామి పీర్లు